


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM
www.suryaa.com




# తెలంగాణలో రేపే పోలింగ్

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. రాష్ట్రంలో మంగళవారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసినందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారం చేయొద్దని సూచించారు. సోషల్‌మీడియాలో కూడా ఎన్నికల ప్రచారం కుదరదని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఓటుహక్కు లేని స్థానికేతరులు వెంటనే నియోజకవర్గాలను విడిచి వెళ్లాలని స్పష్టంచేశారు. రాష్ట్రంలో మంగళవారం సాయంత్రం నుంచే 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని, ఐదుగురు కంటే ఎక్కువ మంది ఒకేచోట గుమికూడవద్దని సూచించారు. మంగళవారం ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈవీఎంల మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను మంగళవారం రాత్రి కల్లా ఎన్నికల పరిశీలకుల సమక్షంలో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజలను ప్రలోభ పెట్టేవాటిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కంట్రోల్‌రూం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## రాష్ట్రమంతా అమల్లోకి వచ్చిన 144 సెక్షన్

### నేడు ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌తోపాటు అక్కడే ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఫెసిలిటేషన్ సెంటర్‌లో బుధవారం కూడా ఓటుహక్కు వినియోగించుకోవచ్చునని తెలిపారు. బుధవారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తామని, అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు వాహనాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ వాహనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ముం దుగా సూచించిన మార్గంలో కాకుండా వేరే దారి లో వెళ్లకూడదని స్పష్టం చేశారు. టీ తాగేందుకు, లేదా ఇతర అవసరాలకు కూడా వాహనాలను నిలపవద్దని ఆదేశించారు. మాక్ పోలింగ్‌ను నిర్వహించడానికి గురువారం ఉదయం 5.30 గంటల కల్లా అభ్యర్థుల ఏజెంట్లు రావాలని సూచించారు.

### గుర్తులు, పేర్లు ఉన్న ఓటరు స్లిప్పులకు నో

ఓటరు స్లిప్పలను గుర్తింపు కార్డుగా పరిగణలోకి తీసుకోబోమని, ఓటరు కార్డు లేదా ఇతర 12 రకాల కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకొనిరావాలని వికాస్‌రాజ్ సూచించారు. రాజకీయ పార్టీలు ఇచ్చే ఓటరు స్లిప్పపై అభ్యర్థి పేరు, గుర్తు, పార్టీ పేరు ఏవీ ఉండకూడదని, తెల్లకాగితంపై ముద్రించిన వాటిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టంచేశారు. ఈవీఎంల దగ్గరికి పోలింగ్ ఏజెంట్లు వెళ్లవద్దని, ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ఫోన్ తీసుకొనిరావద్దని సూచించారు. ఓటింగ్ రహస్యంగా వేయాల్సి ఉంటుందని, ఓటును ఫొటో తీయడానికి కూడా వీలులేదని తెలిపారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నవారిలో 94% మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు.

### 27,094 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

రాష్ట్రంలో 35,655 పోలింగ్ కేంద్రాలు ఉండ గా ఇందులో 27,094 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ చేయనున్నట్టు వికాస్‌రాజ్ వెల్లడించారు. ఒకేచోట ఎక్కువ సంఖ్యలో కేంద్రాలు ఉన్న 7,571 చోట్ల బయట కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 12 వేల కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పోలింగ్ కేంద్రాలను 3,806 సెక్టార్‌లుగా విభజించామని, పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయకపోయినా, ఇతర సమస్యలున్నా సెక్టార్ అధికారులు పరిష్కరిస్తారని చెప్పారు.

### రేపు సెలవు

ఎన్నికల పోలింగ్ సందర్భంగా గురువారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థలకు సెలవు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలున్న విద్యాసంస్థలకు బుధ, గురువారాల్లో సెలవు ఇచ్చారు. ఎన్నికల విధుల్లో ఉన్న విద్యాశాఖ సిబ్బందికి బుధ, గురువారాల్లో సెలవుతోపాటు డిసెంబర్ 1న స్పెషల్ క్యాజువల్ లీవుగా ప్రకటించారు.

### 737 కోట్లు సీజ్

ఇప్పటివరకు రూ.737 కోట్ల విలువైన నగదు, వస్తువులు, మద్యాన్ని సీజ్ చేశామని వికాస్‌రాజ్ వెల్లడించారు. ఇందులో రూ.302 కోట్ల నగదు, రూ.125 కోట్ల విలువైన మద్యం, రూ.40 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.186 కోట్ల విలువైన మెటల్స్, రూ.84 కోట్లు విలువైన ఉచిత బహుమతులను సీజ్ చేశామని వివరించారు. సమావేశంలో అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి పాల్గొన్నారు.





## కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణకు ఈసీ ఆదేశం

తెలంగాణ ఎన్నికల ప్రచారం చివరి రోజున భారాస అభ్యర్థి కౌశిక్‌రెడ్డి చేసిన భావోద్వేగ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుజూరాబాద్ ఎన్నికల అధికారులను ఆదేశించింది. మంగళవారం జరిగిన ప్రచారంలో కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపిస్తే జైత్రయాత్ర.. ఓడితే శవయాత్ర.. నేను ఏ యాత్ర చేయాలో మీరే నిర్ణయించుకోండి' అంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఈసీ నివేదిక కోరింది.




## అలా చేస్తే మీ ఓటు రద్దు

పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్ అనుమతి లేదు. కానీ కొంత మంది అక్రమంగా తీసుకెళ్లి ఓటు వేసేటప్పుడు సెల్ఫీ తీసినా, వీడియో తీసినా, దాన్ని ఇతరులకు చూపించినా ఆ ఓటు చెల్లదు. రూల్స్ ప్రకారం దానిని ఎన్నికల అధికారి 17ఏలో నమోదు చేస్తారు. దాంతో ఆ ఓటు లెక్కింపుకు రాదు. అంధులకు సహాయంగా వెళ్లే వారు కూడా ఓటు ఎవరికి వేశారు అనేది చెప్పవద్దు. ఒకరి ఓటును మరొకరు వేస్తే దాన్ని రద్దు చేసి, మళ్లీ ఓటేసే అవకాశం ఉంది. భారత ఎన్నికల సంఘం 1961లో తీసుకొచ్చిన సెక్షన్ 49(పి) ప్రకారం దీన్ని 'టెండర్డ్ ఓటు' అంటారు. ఇతరులు ఓటేసినట్లు గుర్తిస్తే వెంటనే ప్రిసైడింగ్ అధికారికి తెలిపి ఓటర్ గుర్తింపు కార్డు సమర్పించాలి. కొంత ప్రక్రియ తర్వాత ఓటేయవచ్చు. అయితే ఈవీఎంలో టెండర్డ్ ఓటు వేసే చాన్స్ లేదు. ప్రత్యేక కవర్ లో ఓటును భద్రపరిచి కౌంటింగ్ కేంద్రానికి పంపుతారు.



## ఘోర రోడ్డు ప్రమాదం.. పొగమంచు కారణంగా ఢీకొన్న 30 వాహనాలు

అమెరికాలో పొగమంచు కారణంగా ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై డజన్ల కొద్దీ వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఓ వ్యక్తి గాయపడినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇడాహో రాష్ట్రంలోని పొక్టాటెల్లో లోని ఇంటర్‌స్టేట్ 86 రహదారిపై సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. పొగమంచు కారణంగానే ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. సుమారు 30 వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నట్లు చెప్పారు. ఈ ఘటనలో గాయపడిన ఓ వ్యక్తిని అంబులెన్స్ సాయంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వెంటనే రంగంలోకి దిగిన అత్యవసర సిబ్బంది అక్కడ సహాయక చర్యలు చేపట్టారు. మొత్తం రోడ్డును క్లియర్ చేసేందుకు సుమారు 7 గంటల సమయం పట్టినట్లు వారు వెల్లడించారు.

## జేఈఈ మెయిన్ దరఖాస్తుకు గడువు రేపే

2024 జనవరి 24 నుంచి ప్రారంభమయ్యే జేఈఈ మెయిన్ తొలి విడత ఆన్‌లైన్ పరీక్షలకు దరఖాస్తు గడువు ఈ నెల 30వ తేదీ రాత్రి 9 గంటలకు ముగియనుంది. దేశవ్యాప్తంగా దాదాపు 8.50 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చని అంచనా. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1.50 లక్షల మంది దరఖాస్తు చేయనున్నారు. గత జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్-2023 తొలి విడత పేపర్-1కు(బీటెక్‌లో ప్రవేశానికి) 8.60 లక్షల మంది దరఖాస్తు చేయగా.. 8.24 లక్షల మంది పరీక్షలు రాశారు.




## మహిళ గొంతుకోసి భర్తపై దాడి చేసిన చైన్ స్నాచర్స్



అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం విజయనగర్ కాలనీలో చైన్ స్నాచర్స్ దారుణానికి ఒడిగట్టారు. ఇంటి ఆరు బయట ఉన్న మహిళ మెడలో నుంచి చైన్ దొంగిలించేందుకు ప్రయత్నించగా ప్రతిఘటించడంతో ఆమె గొంతు కోశారు. దీంతో కేకలు వేయడంతో ఆమె భర్త వచ్చి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో అతడిపైనా దాడి చేసి చైన్ స్నాచర్స్ పరారయ్యారు. బాధిత మహిళ, ఆమె భర్తను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. సీసీ ఫుటేజ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



## డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూ ఎఫ్ఐ) ఎన్నికల నిర్వహణకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికలపై పంజాబ్ అండ్ హర్యానా కోర్టు విధించిన స్టేను తాజాగా సుప్రీంకోర్టు కొట్టేసింది. జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ఎన్నికలను నిర్వహించాలని రిటర్నింగ్ ఆఫీసర్‌ను కోరింది. ఎన్నికల ప్రక్రియను అర్థం చేసుకోవడంలో పంజాబ్ అండ్ హర్యానా కోర్టు విఫలమైందని వ్యాఖ్యానించింది.



## శ్రీలంక వీసా ఉచిత సేవలు ప్రారంభం

భారతీయులతోపాటు 7 దేశాలకు వీసా ఫ్రీ సేవలను శ్రీలంక ప్రారంభించింది. ఇక నుంచి భారత్, చైనా, రష్యా, మలేసియా, జపాన్, ఇండోనేసియా, థాయ్‌లాండ్ దేశాలవారు వీసా లేకుండానే శ్రీలంకలో 30 రోజులపాటు పర్యటించవచ్చు. అక్కడి విమానాశ్రయంలో తనిఖీ, పాస్‌పోర్టుపై ఎంట్రీ, ఎగ్జిట్ (డ్యూయెల్) స్టాంపింగ్ మాత్రమే ఉంటుంది. శ్రీలంక వీసా ఫ్రీ సౌకర్యం 2024 మార్చి 31వ తేదీ వరకూ అమల్లో ఉంటుంది.

## ఎల్ఐసీ కొత్త పాలసీ.. ఐదేళ్లు కడితే జీవితాంతం ఆదాయం

కష్టపడి సంపాదించి దాచుకున్న సొమ్ముకు భద్రత, ప్రతిఫలం కోరుకోవడం సహజం. అదే సమయంలో కుటుంబానికి పెద్ద దిక్కైన వ్యక్తికి జరగరానిది ఏదైనా జరిగితే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసానివ్వడం కోసం బీమా కూడా అవసరం.ఈ రెండూ కలయికలో ఇప్పటికే ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ (LIC) పలు పాలసీలను తీసుకొచ్చింది. అయినా అధిక ప్రతిఫలం కోసం తమ సొమ్మును మదుపరులు ఇతరత్రా పెట్టుబడి సాధనాల్లో మదుపు చేస్తున్నారు. ఈ క్రమంలో పొదుపు+ బీమాతో పాటు గ్యారెంటీ రిటర్న్స్ తో ఎల్ఐసీ ఓ కొత్త పాలసీని తీసుకొచ్చింది. అదే జీవన్ ఉత్సవ్ ( LIC Jeevan Utsav). ప్లాన్ నంబర్ 871 (Plan No. 871). నవంబర్ 29న ఈ పాలసీని లాంచ్ చేసింది.




## రాహుల్.. అప్పటి వరకు కోచ్‌గా కొనసాగు.. బీసీసీఐ మరో ప్రతిపాదన

టీమ్‌ఇండియా ప్రధాన కోచ్‌గా ఇటీవల కాంట్రాక్ట్‌ను పూర్తి చేసుకున్న రాహుల్ ద్రవిడ్‌ను కొనసాగించాలని బీసీసీఐ భావిస్తోంది. మరో రెండేళ్లు అతడికి అవకాశం ఇస్తామని ఇప్పటికే బీసీసీఐ ప్రతిపాదించింది. ద్రవిడ్ మాత్రం కొనసాగేందుకు సుముఖంగా లేకపోవడంతో మరో ఆఫర్‌తో ముందు కొచ్చింది. కనీసం వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ వరకైనా జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాలని కోరింది. ఒకవేళ ద్రవిడ్ ఈ ఆఫర్‌కు అంగీకరిస్తే.. అతడితోపాటు వన్డే ప్రపంచకప్ వరకు ఉన్న సహాయక సిబ్బంది కూడా కొనసాగే అవకాశం ఉంది. బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్, బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రేకు కాంట్రాక్ట్ పొడిగింపు లభించనుంది. ద్రవిడ్‌ను కొనసాగించాలనే బీసీసీఐ నిర్ణయానికి భారత కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా మద్దతుగా నిలిచారు. అలాగే ద్రవిడ్‌ను దక్షిణాఫ్రికా పర్యటనకు పంపించాలని బీసీసీఐ భావిస్తోంది. డిసెంబర్ 10 నుంచి జనవరి 7 వరకు ఈ పర్యటన కొనసాగనుంది. "కాంట్రాక్ట్ కొనసాగింపుపై చర్చలు జరుగుతూనే ఉంటాయి. అయితే, దక్షిణాఫ్రికాతో సిరీస్ చాలా కీలకం. ఈ పర్యటనలోని టీ20



సిరీస్‌కు వెళ్లకూడదని ద్రవిడ్ భావిస్తే.. వన్డేల నాటికి భారత జట్టుతో కలవచ్చు" అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ దక్షిణాఫ్రికా పర్యటనకు ద్రవిడ్‌నే పంపాలని యాజమాన్యం బలంగా భావిస్తున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. లక్ష్మణ్‌కు ఇప్పటికే ఎన్‌సీఏ పనులతో బిజీగా ఉన్నాడని.. అండర్-19 వరల్డ్ కప్ కూడా సమీపిస్తున్న తరుణంలో దక్షిణాఫ్రికా పర్యటనకు పంపడమూ కష్టమేనన్న బీసీసీఐ అధికారులు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మణ్ ఆసీస్‌తో టీ20 సిరీస్‌కు కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు.

## ఆరు రాష్ట్రాలకు చైనా వైరస్ అలర్ట్



చైనాలో కొత్తరకం న్యూమోనియా బారినపడి పిల్లలు పెద్ద సంఖ్యలో ఆస్పత్రుల్లో చేరుతున్నట్టు గతవారం డబ్ల్యూహెచ్ఓ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో భారత్ సహా ప్రపంచ దేశాలు అప్రమత్తమయ్యాయి.ఈ క్రమంలో దేశంలోని ఆరు రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్ జారీ చేసింది. ఇందులో రాజస్థాన్, కర్ణాటక, గుజరాత్, ఉత్తరాఖండ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు ఉన్నాయి. వైద్య సదుపాయాల సంసిద్ధతను సమీక్షించాలని ఆయా రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. కేంద్రం హెచ్చరికలతో ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు శ్వాసకోశ సమస్యలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి సిద్ధంగా ఉండాలని ఆస్పత్రులు, వైద్య సిబ్బందిని ఆదేశించాయి. ముఖ్యంగా కోవిడ్ సమయంలో చేపట్టిన చర్యల తరహాలో ఏర్పాట్లు ఉండాలని అదేశించాయి. సీజనల్‌గా వచ్చే ఫ్లూ వంటి వ్యాధుల పట్ల పౌరులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ పేర్కొంది. అలాగే కాలానుగుణంగా ఈ వ్యాధుల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే గైడ్‌లైన్స్‌లు కూడా వారికి అందించాలని పేర్కొంది.

